

# నన్నెవరూ ఊహించలేరు

'శంకర్‌గారితో పనిచేయడం నిజంగా అదృష్టం. మా కోసం లక్నో వరకూ వచ్చిన అభిమానులకు థ్యాంక్స్. అందరి అంచనాలను మించి 'గేమ్‌చేంజర్' ఉంటుంది.' అని రామ్‌చరణ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'గేమ్‌చేంజర్'. శంకర్ దర్శకత్వంలో దిల్‌రాజు అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా టీజర్‌ని శనివారం లక్నోలో విడుదల చేశారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ పై విధంగా మాట్లాడారు. 'మా సంస్థ నుంచి వస్తున్న 50వ చిత్రం ఇది. శంకర్ గారితో సినిమా చేయాలనేది నా డ్రీమ్. దానికితోడు రామ్‌చరణ్ కూడా తోడవ్వడం మరింత ఆనందంగా ఉంది.' అని దిల్‌రాజు చెప్పారు. ఇంకా కియారా అద్వానీ, అంజలి, ఎస్.జె.సూర్య కూడా మాట్లాడారు. ఇదిలావుంటే శనివారం విడుదలైన టీజర్ అభిమానుల్ని అలరించేలా ఉంది. పొలిటికల్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా ఈ సినిమా రూపొందినట్టు టీజర్ చెబుతున్నది. 'ఐయామ్ అన్‌ప్రెడిక్టబుల్..' అంటూ రామ్‌చరణ్ స్టైలిష్‌గా చెప్పిన డైలాగ్‌తో ఈ టీజర్ ముగిసింది. రామ్‌చరణ్ నటనతోపాటు సంభాషణలు, సంగీతం సినిమాకు హైలైట్‌గా నిలుస్తాయని మేకర్స్ చెబుతున్నారు. జనవరి 10న పాన్ ఇండియా స్థాయిలో ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా విడుదల కానుంది.

# గాయనిగా కొత్త అవతారం



నటి శ్రద్ధాదాస్ గాయనిగా అవతారం ఎత్తారు. సూర్య నటించిన ప్రతిష్టాత్మక పాన్ ఇండియా చిత్రం 'కంగువా'లో ఆమె ఓ పెప్పీ సాంగ్‌ని ఆలపించారు. 'హోల్డ్ మీ.. హగ్ మీ.. కిస్ మీ.. కిల్ మీ..' అంటూ సాగిన ఈ పాటను రాకేందుమౌళి రాయగా, దేవిశ్రీప్రసాద్ స్వరపరిచారు. సాగర్, దేవిశ్రీలతో కలిసి శ్రద్ధాదాస్ ఆలపించారు. సూర్య, దిశా పటాని, బాబీడియోల్‌పై ఈ పాటను చిత్రీకరించారు. విడుదలైన కాసేపటికే ఈ పాట మిలియన్ల వ్యూస్ సాధించిందని, దేవిశ్రీ, శ్రద్ధాదాస్, సాగర్‌ల గాత్రం ఈ పాటకు ఆకర్షణగా నిలిచాయని మేకర్స్ తెలిపారు. శివ దర్శకత్వంలో కె.ఈ.జ్ఞానవేల్‌రాజా, వి.వంశీకృష్ణారెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానున్న విషయం తెలిసిందే.

# బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్

వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రం 'డ్రింకర్ సాయి'. 'బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్' అనేది ఉపశీర్షిక. ధర్మ, ఐశ్వర్యశర్మ జంటగా నటిస్తున్నారు. కిరణ్ తిరుమలశెట్టి దర్శకుడు. బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మాతలు. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణంలో ఉంది. శనివారం ఈ సినిమా ఫస్ట్ లుక్, టైటిల్‌ని ప్రముఖ దర్శకుడు మారుతి లాంచ్ చేసి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు అందించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రంలో పోసాని కృష్ణమురళి, శ్రీకాంత్ అయ్యంగార్, సమీర్, ఎస్ఎస్ కాంచి తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: ప్రశాంత్ అంకిరెడ్డి, సంగీతం: శ్రీవసంత్.





# కిస్సిక్ అంటూ కిర్రెక్కిస్తా..

'పుష్ప' సినిమాలో 'ఊ అంటావా మావ..' పాట ఎంతటి హిట్ అయ్యిందో తెలిసిందే. ఒక్క పాటతో హీరోయిన్ స్థాయి క్రెడిబులిటీని కొట్టేసింది అందాల సమంత. త్వరలో 'పుష్ప 2' రాబోతున్నది. ఆనవాయితీ ప్రకారం తొలి పార్ట్‌లో ఉన్నట్టే ఈ మలి పార్ట్‌లోనూ ఓ ఐటమ్ నంబర్‌ని ఆడియన్స్ ఎక్స్‌పెక్ట్ చెయ్యడం కామన్. దాన్ని గ్రహించే 'పుష్ప 2'లో కూడా అదిరిపోయే ఐటమ్ సాంగ్‌ని ప్లాన్ చేశారు దర్శకుడు సుకుమార్. మరి ఈ సారి బన్నీతో అడుగు కలిపే తార ఎవరు? అనే విషయంపై ఇన్నాళ్లూ అటు మీడియాలో, ఇటు పరిశ్రమలో తర్జనభర్జనలు జరిగాయి. ఎట్టకేలకు ఈ పాటలో శ్రీలీల కనిపించనున్నట్టు తేటతెల్లమైపోయింది. రీసెంట్‌గా 'పుష్ప2' సెట్‌లో అల్లు అర్జున్, శ్రీలీల ఉన్న ఫొటో ఒకటి సోషల్ మీడియాలో లీక్ అయ్యింది. దాంతో మైత్రీ మూవీమేకర్స్ వారు అధికారికంగా ఆ పాట వివరాలను శనివారం ఎక్స్(ట్విటర్) ద్వారా తెలియజేశారు. ఇందులో 'కిస్సిక్..' అంటూ సాగే ఐటమ్ సాంగ్ హైలైట్‌గా నిలుస్తుందని వారు ఈ పోస్ట్‌లో వెల్లడించారు. గతంలో 'ఆహా' ఓటీటీకి సంబంధించిన ప్రకటనలో బన్నీ, శ్రీలీల కలిసి నటించారు. ఇప్పుడు 'పుష్ప2' కోసం మరోసారి ఇద్దరూ కలిసి నర్తించనున్నారు. ఇది బన్నీ ఫ్యాన్స్‌కు నిజంగా శుభవార్తే.

# వినోదమే విజయ మంత్రం

''ధూం ధాం' చిత్రానికి విడుదలైన అన్ని కేంద్రాల్లో అద్భుతమైన స్పందన లభిస్తున్నది. ప్రతి సెంటర్‌లో 80 శాతం ఆక్యుపెన్సీ కనిపిస్తున్నది. సినిమాలోని ఎంటర్‌టైన్‌మెంట్ ప్రేక్షకుల్ని అలరిస్తున్నది' అన్నారు చేతన్‌కృష్ణ. ఆయన హీరోగా నటించిన 'ధూం ధాం' చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. సాయికిషోర్ మచ్చా దర్శకత్వంలో ఎం.ఎస్.రామ్‌కుమార్ నిర్మించారు. శనివారం సక్సెస్‌మీట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాత రామ్‌కుమార్ మాట్లాడుతూ 'పెద్ద సినిమాల పోటీలో చిన్న చిత్రమైన 'ధూం ధాం' నిలదొక్కుకోవడం గొప్ప విషయంగా భావిస్తున్నాం. ఓటీటీ కోసం వెయిట్ చేయకుండా ప్రేక్షకులందరూ థియేటర్లో సినిమా చూడాలని కోరుతున్నా. ఎందుకంటే ఇలాంటి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను థియేటర్‌లో చూస్తేనే మంచి అనుభూతిని పొందుతాం' అన్నారు. కడుపుబ్బా నవ్వించే వినోదంతో సినిమా అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంటున్నదని దర్శకుడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.



# అంతకుమించిన ఆనందం లేదు!



'ఈ దేశంలో చెలామణి అయ్యే ప్రతీ రూపాయిలో తొంభై పైసలు కొందరే సంపాదిస్తారు. మిగతా పది పైసల గురించి అందరూ కొట్టుకుంటారు. సినిమాలో హీరో వాసు ఆ కొందరిలో ఒకడిగా ఉండాలనుకుంటాడు. ఆ కాన్సెప్ట్ ఆధారంగానే ఈ సినిమా తీశాం' అన్నారు వరుణ్‌తేజ్. ఆయన హీరోగా కరుణకుమార్ దర్శకత్వంలో రూపొందిన 'మట్కా' చిత్రం ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా శనివారం వరుణ్‌తేజ్ పాత్రికేయులతో పంచుకున్న విశేషాలు..

- బర్మా నుంచి విశాఖపట్టణానికి శరణార్థిగా వచ్చిన వాసు అనే యువకుడి కథ ఇది. 1958 నుంచి 1982 వరకు అతని ప్రయాణాన్ని ఆవిష్కరిస్తుంది. ఓ సాధారణ యువకుడి స్థాయి నుంచి మట్కా ప్రపంచాన్ని శాసించే డాన్‌గా ఎదిగిన వైనాన్ని కళ్లకు కడుతుంది.
- మూడు కాల వ్యవధుల్లో సాగే ఈ కథలో నేను మూడు విభిన్న గెటప్స్‌లో కనిపిస్తాను. స్క్రిప్ట్ చదువుతున్నప్పుడే వాసు పాత్రని ఎలా పెర్ఫామ్ చేయాలో అర్థం చేసుకున్నా. అతని వయసు పెరుగుతున్న కొద్దీ బాడీలాంగ్వేజ్, యాస మారుతుంటుంది. పాత్ర తాలూకు ఈ పరివర్తనను స్క్రీన్‌పై తీసుకురావడం ఛాలెంజింగ్‌గా అనిపించింది.
- ఈ కథలో ఎలాంటి సందేశాలు ఉండవు. పక్కా కమర్షియల్ సినిమా ఇది. వాసు పాత్ర తాలూకు కోపం, అసహనం, సంఘర్షణను ప్రేక్షకులు కూడా ఫీలవుతారు. అతని పాత్రతో ప్రయాణం చేస్తూ అతని తాలూకు భావోద్వేగాల్లో భాగమవుతారు. వాసు పాత్రను అంతటి శక్తివంతమైన ఎమోషన్స్‌తో దర్శకుడు తీర్చిదిద్దాడు.
- నా క్యారెక్టర్‌లోని ఇంటెన్స్ ఎమోషన్స్, వేరియేషన్స్ నచ్చి ఈ సినిమాకు అంగీకరించా. థియేటర్‌లోని ప్రేక్షకులు హీరోతో పాటు ప్రయాణం చేయాలి. వాడి క్యారెక్టర్‌తో కనెక్ట్ కావాలి. అతను గెలవాలని కోరుకోవాలి. అదే కమర్షియల్ సినిమా ఫార్ములా.
- గ్యాంగ్‌స్టర్ డ్రామా 'గ్యాంగ్స్ ఆఫ్ వస్సేపూర్' చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతాన్నందించారు. ఈ కాన్సెప్ట్ కూడా గ్యాంగ్‌వార్ నేపథ్యంలో నడుస్తుంది కాబట్టి ఈ చిత్రానికి కూడా అతనే పర్‌ఫెక్ట్ ఛాయిస్ అనిపించింది. ఈ సినిమాలో పాటలతో పాటు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అద్భుతంగా కుదిరింది.
- దర్శకుడు కరుణకుమార్ మంచి రచయిత. ఆయన సెన్సిబిలిటీస్ నాకు చాలా ఇష్టం. తను నమ్మిన విషయాన్ని ధైర్యంగా చెప్పే ప్రయత్నం చేస్తారు. ఇది పీరియాడిక్ చిత్రం కాబట్టి చాలా భాగం సెట్స్ వేసి నాటి వాతావరణాన్ని పునఃసృష్టించాం.
- ఈ సినిమాలో దాదాపు నాలుగు గెటప్స్‌లో కనిపిస్తా. డిఫరెంట్ షేడ్స్‌తో సాగే ఇలాంటి పాత్ర దొరకడం అదృష్టంగా భావిస్తున్నా. ప్రేక్షకులు స్క్రీన్‌పై వరుణ్‌తేజ్‌ని కాకుండా వాసు పాత్రనే చూడాలి. దానికోసం చాలా కష్టపడ్డాను. 'గద్దలకొండ గణేష్' తర్వాత నేను బయటకు వెళ్లినప్పుడు చాలా మంది 'గణేష్' అని పిలిచేవారు. అదే నాకు బిగ్గెస్ట్ కాంప్లిమెంట్‌గా భావించా. సినిమాలోని క్యారెక్టర్ పేరుతో నన్ను పిలిస్తే ఓ నటుడిగా అంతకంటే ఆనందం మరొకటి ఉండదు.

# అదే యానిమల్ పార్క్ లక్ష్యం



రణ్‌బీర్ కపూర్‌తో సందీప్‌రెడ్డి వంగా తెరకెక్కించిన 'యానిమల్' చిత్రం ఎంతటి విజయాన్ని అందుకుందో తెలిసిందే. దాదాపు 900కోట్ల రూపాయల వసూళ్లను రాబట్టిందా సినిమా. ఈ సినిమా ముగింపులో దీనికి సీక్వెల్‌గా 'యానిమల్ పార్క్' రానున్నదంటూ దర్శకుడు వెల్లడించారు. దాంతో సీక్వెల్‌పై ఆడియన్స్‌లో ఆసక్తి నెలకొన్నది. తాజాగా 'యానిమల్ పార్క్' గురించి నిర్మాత భూషణ్‌కుమార్ ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు. ' 'యానిమల్ పార్క్' తొలి పార్ట్‌ని మించి ఉంటుంది. ఇందులో బలమైన పాత్రలు ఉంటాయి. 'యానిమల్' కంటే ఎక్కువ థ్రిల్‌ను పంచడమే మా 'యానిమల్ పార్క్' లక్ష్యం. ప్రస్తుతం సందీప్‌రెడ్డి వంగా 'స్పిరిట్' పనుల్లో బిజీగా ఉన్నారు. అది పూర్తవ్వగానే 'యానిమల్ పార్క్' మొదలవుతుంది. రానున్న ఆరు నెల్లలో ఈ సినిమా పనులు మొదలుపెట్టే అవకాశం కనిపిస్తున్నది.' అని తెలిపారు.












Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.